క్లుప్తంగా

ఆయకట్టుకు సాగు నీరందించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

గార్లదిన్నె: మండల పరిధిలోని ఎంపీఆర్ డ్యాం నుంచి డిస్ట్రిబ్యూటరీ కాలువలకు నీరు విడుదల చేసి హెచ్చెల్సీ ఆయకట్టుకు సాగు నీరు అందించాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ ఎంపీఆర్ డ్యాంలో నీరు పుష్కలంగా ఉందని, 5వ డిస్ట్రిబ్యూటరీ కాలువకు నీరు విడుదల చేస్తే యర్రగుంట్ల, మంటిమడుగు, కల్లూరు, కల్లూరు అగ్రహారం, ఇల్లూరు, కల్లుమడి, తరిమెల, నిదనవాడ, రాచేపల్లి, బందార్లపల్లి గ్రామాల వరకూ సాగునీరు వెళ్తుందన్నారు. ఆగస్టు పూర్తి కావస్తున్నా ఐఏబీ సమావేశం నిర్వహించక పోగా, ఆయకట్టుకు సాగు నీరు ఎప్పుడు విడుదల చేస్తారో అధికారులు చెప్పడం లేదన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రం తహసీల్దార్ ఈరమ్మకు అందజేశారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నాగరాజు, సీపీఎం మండల కార్యదర్శి చెన్నారెడ్డి, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

తాడిపత్రిలో ఉడుపి లక్ష్మీపతిస్వామి



ఉడుపి లక్ష్మీపతి స్వామి

తాడిపత్రిటౌన్: కర్ణాటక రాష్ట్రంలో పచ్చబొట్ల స్వామీజీగా పేరొందిన ఉడుపి లక్ష్మీపతి స్వామీజీ సోమవారం తాడిపత్రి పట్టణంలోని బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలంతా సుభిక్షంగా ఉండాలనే తలంపుతో ఉడిపి నుంచి అయోధ్యకు ఆయన పాదయాత్ర చేపట్టారు. తిరుగు ప్రయాణంలో తాడిపత్రికి చేరుకున్న ఆయన పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే పట్టణంలోని పలువురు ప్రముఖులు ఇళ్లకు ఆహ్వానించి ఆయన ఆశీస్సులు పొందారు.

శ్మశాన వాటికలో చెత్త డంప్ నివారించాలి



ఈఓకు వినతిపత్రం అందజేస్తున్న సీఎస్ఐ చర్చి సభ్యులు

పామిడి: పట్టణంలోని సర్వేనెంబర్ 1,310–2 లోని క్రైస్తవ కొత్త శ్మశాన వాటికలో పంచాయతీ చెత్తా చెదారం డంప్ చేయకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక సీఎస్ఐ చర్చి సభ్యులు ఒ.వీరయ్య, పి.అనిల్‌కుమార్‌రాజా, వి.బుజ్జిబాబు కోరారు. సోమవారం వారు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పంచాయతీ ఈఓ కమ్ ఈఓఆర్డీ అశ్వర్థనాయుడుకు వినతిపత్రం అందజేశారు. చెత్తాచెదారం డంప్ చేయడం వల్ల దుర్వాసనతో పాటు మృతదేహాలను పూడ్చడం ఇబ్బందిగా మారిందన్నారు.

పోలీస్ ఔట్ పోస్టులను వినియోగంలోకి తీసుకురండి

గుంతకల్లుటౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి, ఆర్‌అండ్‌బీ సర్కిల్‌లో మూతపడిన రెండు పోలీస్ ఔట్ పోస్టులను తిరిగి తెరిపించి, పోలీస్ సిబ్బంది ద్వారా ప్రజలకు సేవలందించాలని డీఎస్పీ శ్రీనివాస్‌ను బీజేపీ నాయకులు కోరారు. సోమవారం డీఎస్పీని బీజేపీ పట్టణ అధ్యక్షుడు వడ్డే రమేష్, నాయకులు నారాయణరెడ్డి, శ్రీనివాసులు, రామాంజనేయులు కలసి వినతిపత్రం అందజేశారు. అలాగే పట్టణంలోని డిగ్రీ, ఇంటర్ కళాశాలలు, హైస్కూళ్ల వద్ద ఆకతాయిల ఆగడాలు మితిమీరకుండా పోలీసు గస్తీని పెంచడంతో పాటు సంబంధిత పోలీసు అధికారుల ఫోన్ నెంబర్లతో కూడిన బోర్డులను ఏర్పాటు చేయాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు బీజేపీ నాయకులు తెలిపారు.

భారీ వృక్షం నరికివేత



కమలపాడులో వృక్షాన్ని నరికిన దృశ్యం

యాడికి: పచ్చదనం పెంపొందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు తోడ్పడేలా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని అధికారులతో పాటు ప్రజా ప్రతినిధులు ప్రచారం చేస్తుంటారు. కానీ క్షేత్రస్థాయిలో అందుకు భిన్నమైన పరిస్థితులు ఉండటం అధికారుల నిర్వాకానికి నిదర్శనం. వాల్టా చట్టం అమలు చేయాల్సిన అధికారులే ఉల్లంఘించడమేంటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ విషయంపై తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డిని వివరణ కోరగా నూతన దేవాలయం నిర్మించాలనే ఉద్దేశ్యంతో గ్రామస్తులంతా గ్రామ కంఠంలో ఉన్న పెద్ద వృక్షంతో పాటు కంప చెట్లను నరికివేశారని వీఆర్ఓ తెలిపారన్నారు. పంచాయతీ, రెవెన్యూ అధికారుల అనుమతులు లేకుండా వృక్షాలు తొలగించకూడదన్నారు.

వినాయక ఉత్సవాలకు వేళాయె..

- వాడవాడలా మండపాల ఏర్పాటు
- వివిధ రూపాల్లో కొలువుదీరనున్న గణనాథులు



గుంతకల్లులో మండపాలకు తరలించడానికి సిద్ధంగా గణేష్ విగ్రహాలు



విగ్రహాలు కొనుగోలు చేస్తున్న దృశ్యం

గుంతకల్లు: వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా చేసుకోవడానికి ప్రజలు సిద్ధమయ్యారు. ఏడాదిలో ఎన్ని పండగలు వచ్చినా వినాయకచవితి తెచ్చే సంతోషం..సంబరం మాటల్లో చెప్పలేనిది. పల్లెల నుంచి పట్టణం దాకా..మురికివాడ నుంచి ఖరీదైనా అపార్టుమెంట్ల వరకూ ఎవరి స్థాయిలో వారు అంబరాన్నంటేలా చేసుకునే వేడుక. మూడు రోజుల పాటు ఉత్సవం చేసుకుని ఏడాది పాటు ఆ జ్ఞాపకలను నెమరువేసుకుని తిరిగి రెట్టించిన ఉత్సాహంతో వినాయక చవితికి సిద్ధమయ్యే అరుదైన పండుగ. వినాయక చవితిని స్వామివారిని వివిధ రూపాల్లో రూపొందించి పూజాలు చేస్తారు. 27వ తేదీ పండుగ ఉండడంతో.. నియోజకవర్గంలోని గుంతకల్లు, గుత్తి, పామిడిల్లో సోమ, మంగళవారల్లో వినాయకుడి ప్రతిమలను కొనుగోలు చేసి ఇళ్లకు తీసుకెళ్లారు. అలాగే మండపాల్లో ఉంచేందుకు కమిటీ సభ్యులు 10–15 అడుగుల భారీ విగ్రహాలు కొనుగోలు చేసి లారీలు, ట్రాక్టర్లు, ఆటోలు తదితర వాహనాల్లో తీసుకెళ్తున్నారు. ఈ ఏడాది మూడో రోజు శుక్రవారం కావడంతో నాలుగో రోజు 30వ తేదీ శనివారం మార్కెట్ యార్డు సమీపంలోని జీఎస్‌బీసీ కాలవ వద్ద నిమజ్జనంతో వేడుకలు ముగుస్తాయి. ఉత్సవాలు ప్రశాంతంగా చేసుకునేందుకు పోలీసు అధికారులు ముందస్తు సూచనలు చేశారు.

ముస్తాబవుతున్న మండపాలు

గుంతకల్లు నియోజకవర్గంలో సమారు 600లకు పైగా మండపాలు సిద్ధం చేశారు. ఒక్క గుంతకల్లులోనే దాదాపు 400కు పైగా మండపాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిసింది. విద్యుత్‌లైట్లు ఆకర్షణంగా నిలుస్తున్నాయి. ఆపోపా ఆధ్వర్యంలో ప్రత్యేక సెట్టింగులు చేయిస్తున్నారు. గుంతకల్లు పట్టణంలోని 37 వార్డుల్లో వినాయకచవితి కమిటీ పేరుతో విగ్రహాలు చేస్తున్నారు. పండగ సందర్భంగా పూల దుకాణాలు కిటకిటలాడాయి. వినాయకుడి ప్రతిమలు, పూజా సామగ్రి, చెరుకు, పత్రి, మామిడి ఆకులు, అరటి పండ్లు, టెంకాయలు తదితర అమ్మకాలు జోరుందుకున్నాయి. దీంతో పూలు, పండ్ల ధరలు అమాంతం పెంచారు.

రాయలసీమకే తలమానికం

వినాయక విగ్రహాల తయారీలో రాయలసీమలోనే గుంతకల్లుకు పెట్టింది పేరు. ఇక్కడ తయారు చేసే విగ్రహాలు రాయలసీమతో పాటు కర్ణాటకలోని బళ్లారి, రాయచూర్ తదితర ప్రాంతాలకు తరలివెళ్లాయి. అర అడుగు విగ్రహం నుంచి సూమరు 20 అడుగుల మేర గణేష్ విగ్రహాలు తయారు చేసిన ఘనత గుంతకల్లుకే సొంతం. గుంతకల్లులోని సత్యనారాయణపేట, బెంచ్‌కొట్టాల, పారిశ్రామికవాడలో దాదాపు 150కి పైగా విగ్రహాల తయారీ కేంద్రాలు ఉన్నాయి. రూ. 100 విగ్రహం నుంచి రూ.లక్షదాకా విగ్రహాల ధరలు పలుకుతున్నాయి.

పరామర్శ



పేరం స్వర్ణలతను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రిటౌన్: తాడిపత్రి పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి పేరం స్వర్ణలతను మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సోమవారం పరామర్శించారు. హైదరాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్న ఆమెను కలిసి ఆరోగ్యంపై ఆరా తీశారు. త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో పేరం అమర్‌నాథరెడ్డి, జేసీ సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ అధ్యక్షుడిగా సుంకన్న



గుత్తి: అనంతపురంలోని ఉపాధ్యాయ భవన్‌లో ఆదివారం రాత్రి ప్రధానోపాధ్యాయుల అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా గుత్తి డివిజన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా గుత్తి జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సుంకన్న, జనరల్ సెక్రటరీగా శివశంకర్‌రెడ్డి ఎన్నికయ్యారు. సుంకన్న మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు.

కూటమి పాలనపై ప్రజల్లో అసంతృప్తి



దయ్యాలకుంటపల్లిలో చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరిస్తున్న గువ్వల శ్రీకాంత్‌రెడ్డి

బుక్కరాయసముద్రం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి పెరిగిపోయిందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గువ్వల శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గ సమన్వయ కర్త, మాజీ మంత్రి శైలజానాథ్ పిలుపు మేరకు సోమవారం సాయంత్రం మండలంలోని రెడ్డిపల్లి, ఆ పంచాయతీలోని రేకులకుంట, అమ్మవారిపేట, దయ్యాలకుంటపల్లి, వెంకటాపురం గ్రామాల్లో ఇంటింటికీ చంద్రబాబు మోసం–మోసపూరిత హామీల రీకాలింగ్ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా పార్టీ నాయకులతో ఆయన ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు ఎన్నికల సందర్భంగా మేనిఫోస్టోలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను వివరించారు. పరిపానల చేతకాక నిరుపేదలు, దివ్యాంగుల పింఛన్లు తొలగించడం సిగ్గుచేటన్నారు. అలాగే అధికారాన్ని అడ్డు పెట్టుకుని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులపై దాడులు చేయడంతో పాటు అనవసరంగా కేసులు బనాయిస్తూ జైళ్లకు పంపుతున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ భాస్కర్, నాయకులు బోనా నాగలింగారెడ్డి, సాకే నారాయణస్వామి, జయరామిరెడ్డి, రామచంద్రారెడ్డి, వరికూటి కాటమయ్య, అంకే నరేష్, సాకే లక్ష్మీనారాయణ, రంగానాథ్, సుబ్బరాయుడు, ఎంపీటీసీ శివారెడ్డి, సర్పంచ్ రమేష్, కాటమయ్య, క్రాంతి, బాలక్రిష్ణారెడ్డి, సత్తిరెడ్డి, రఘు, రమణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, చికెన్ నారాయణస్వామి, అంజి, నాగ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలను విజయవంతం చేద్దాం



వినాయక చవితి ఉత్సవాల బ్రోచర్లను విడుదల చేస్తున్న అవోపా నాయకులు



మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న దృశ్యం

గుంతకల్లు: అవోపా వినాయక ఉత్సవ సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం నుంచి ఐదు రోజులు పాటు నిర్వహించే వినాయక చవితి ఉత్సవాలను విజయవంతం చేద్దామని పట్టణ అవోపా నాయకులు విజ్ఞప్తి చేశారు. మంగళవారం జరిగే గిన్నిస్ బుక్ అఫ్ రికార్డు వెండి వినాయకుడి పూజ కార్యక్రమాలతో వినాయక ఉత్సవాలకు అంకుర్పాణ చేస్తామన్నారు. సోమవారం స్థానిక కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అవోపా వినాయక ఉత్సవ సేవా సమితి నాయకులు మిట్ట ఎస్.లోకేంద్రనాథ్, పసుపుల హరిహరనాథ్, పువ్వాడి శ్రీనివాసులు మాట్లాడుతూ మంగళవారం సాయంత్రం వెండి వినాయకుడి విగ్రహాన్ని పువ్వాడి చంద్రశేఖర్ ఇంటి నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి కన్యకపరమేశ్వర ఆలయంలో కొలువుదీర్చి ఉత్సవాలు ప్రారంభిస్తామన్నారు. నాలుగు రోజుల పాటు ఆలయంలో ప్రత్యేక పూజాలు, హోమాలతోపాటు వివిధ సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సేవా సమితి నాయకులు నామా సుధాకర్ గుప్తా, ఇనుగూరు వెంకట సుబయ్య, సంజీవయ్యశెట్టి తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయకుడిని పూజిద్దాం

గుంతకల్లుటౌన్: మట్టి వినాయకుడిని పూజించి పర్యావరణ పరిరక్షణకు అందరూ సహకరించాలని రోటరీక్లబ్ అధ్యక్షుడు సుధీర్‌కార్వా సూచించారు. రోటరీక్లబ్ ఆధ్వర్యంలో మెయిన్ రోడ్డులోని విఘ్నేష్ బుక్ వరల్డ్ వద్ద మాజీ అధ్యక్షుడు వంకదారు ప్రదీప్‌కుమార్, వాసవీ బుక్ స్టాల్ శ్రవణ్ ఆధ్వర్యంలో సుమారు 500 మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ కార్యదర్శి రవికుమార్, ఇన్నర్‌వీల్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సునీత, జ్యోతి, రొటేరియన్లు శిరీష్, శ్రీకాంత్, ధనుంజయ, వినయ్, సౌందర్య, రాహుల్, తదితరులు పాల్గొన్నారు.

శాంతియుతంగా పండుగ చేసుకోవాలి



మాట్లాడుతున్న ఏఎస్పీ రోహిత్‌కుమార్

పెద్దవడుగూరు: వినాయక చవితి ఉత్సవాన్ని శాంతియుతంగా నిర్వహించుకోవాలని తాడిపత్రి ఏఎస్పీ రోహిత్‌కుమార్‌చౌదరి సూచించారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణంలో వినాయకుడి మండపాలు ఏర్పాటు చేసే కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండపం ఏర్పాటు చేసి విగ్రహాలు పెట్టేవారు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. అనుమతులు లేకుండా విగ్రహాలను ఏర్పాటు చేసి శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే సహించబోమని, అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. విగ్రహాలు ఏర్పాటు చేసే ప్రాంతంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తప్పనిసరిగా అనుసరించాలన్నారు. లేకుంటే నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని ఏఎస్పీ హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ రామసుబ్బయ్య, ఎస్‌ఐ ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

జాగ్రత్తలు తీసుకోండి

తాడిపత్రిటౌన్: వినాయక మండలపాల వద్ద జాగ్రత్తలు పాటించాలని సీఐ శివగంగాధర్‌రెడ్డి సూచించారు. వినాయకచవితి వేడుకల్లో భాగంగా బహిరంగ ప్రదేశాల్లో మండపాలు ఏర్పాటు చేస్తున్న వారికి స్థానిక పోలీస్ స్టేషన్‌లో అవగాహన కల్పించారు. మండపాల వద్ద అల్లర్లు, గొడవలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. నిమ్మజనం రోజు సాయంత్రమే కార్యక్రమం పూర్తి చేయాలని సూచించారు.

విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి

బుక్కరాయసముద్రం: వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు తప్పని సరి అని బుక్కరాయసముద్రం సీఐ పుల్లయ్య సూచించారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో వినాయక మండపం కమిటీ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో వినాయక మండపాలు ఏర్పాటు చేయాలనుకునే వారు ముందుగా కమిటీగా ఏర్పడి పోలీస్ స్టేషన్‌లో అనుమతి తీసుకోవాలన్నారు. మండపాల వద్ద డీజేలు, సౌండ్ సిస్టంకు అనుమతి లేదన్నారు. పోలీసుల నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రాంప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

కలసికట్టుగా సంబరాలు..

పెద్దపప్పూరు: వినాయక చవితి పండుగ సందర్భంగా వర్గబేధాలు లేకుండా కలిసికట్టుగా సంబరాలు చేసుకోవాలని పెద్దవడుగూరు సీఐ రామసుబ్బయ్య సూచించారు.సోమవారం ఆయన పెద్దపప్పూరు పోలీస్‌స్టేషన్‌లో మండల వ్యాప్తంగా వినాయక ఉత్సవకమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వినాయక మండపాల వద్ద డీజేలు, అశ్లీల నృత్య ప్రదర్శనలు చేయకూడదన్నారు. నిమజ్జనానికి చీమలవాగుపల్లి వద్ద, చాగల్లు ప్రాజెక్టు వద్ద ఏర్పాట్లు చేశామన్నారు. చిన్నపాటి సమస్య నెలకొన్నా ఉత్సవ కమిటీ సభ్యులే బాధ్యులన్నారు. ఏఎస్‌ఐలు మహదేవ్, హమానుల్లా తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల తొలగింపు చంద్రబాబు కుట్ర



నార్పలలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు



పుట్లూరులో ఎంపీడీఓకు వినతి పత్రం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నార్పల: దివ్యాంగుల పింఛన్ల తొలగింపునకు ముఖ్యమంత్రి చంద్రబాబు కుట్ర పన్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి నార్పల సత్యనారాయణరెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం ఆయన తహసీల్దార్ అరుణ కుమారిని కలిసి దివ్యాంగుల తరఫున వినతి పత్రం అందించారు.ఆయన మాట్లాడుతూ అర్హులైన దివ్యాంగుల పింఛన్లను తొలగించి కూటమి ప్రభుత్వం పెద్ద తప్పు చేస్తోందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హులకు ఇంటి వద్దకే వలంటీర్ల ద్వారా పింఛన్ అందించామన్నారు. కానీ కూటమి ప్రభుత్వం చెప్పిందొకటి చేసేదొకటన్నారు. నోటీసులు జారీ అయిన దివ్యాంగుల పింఛన్లను పునరుద్ధరించాలని, లేకపోతే వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఖాదర్‌వలిఖాన్, జెడ్పీ వైస్ చైర్మన్ నాగరత్నమ్మ, ఎంపీపీ నాగేశ్వరావు, సర్పంచులు రాంభూపాల్‌రెడ్డి, రామాంజనేయులు, ఎంపీటీసీలు పద్మాకర్‌రెడ్డి, రాజారెడ్డి, శంకర్‌యాదవ్, లోక్‌నాథ్ రెడ్డి, ఉపసర్పంచు గవ్వల శ్రీరాములు, పక్కీరెడ్డి, ఎలపనాయుడు, భరత్ తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు: రీ వెరిఫికేషన్ పేరుతో కూటమి ప్రభుత్వం దివ్యాంగుల పింఛన్ల నిలుపుదలకు నోటీసులు ఇవ్వగం సిగ్గు చేటని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పి.మహేశ్వరరెడ్డి మండిపడ్డారు. సోమవారం వైఎస్సార్‌సీపీ శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త శైలజానాథ్ పిలుపు మేరకు ఎంపీడీఓ కార్యాలయం వద్ద దివ్యాంగులకు న్యాయం చేయాలని నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీడీఓ అలివేలమ్మకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ భూమిరెడ్డి రాఘవరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, పలు విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యల్లనూరు: దివ్యాగుల పింఛన్లు పునరుద్ధరించాలంటూ వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం ప్రజాఫిర్యాదుల విభాగంలో తహసీల్దారు రాము, ఇన్‌ఛార్జి ఎంపీడీఓ వాసుదేవరెడ్డి సమక్షంలో ధర్నా చేసి అనంతరం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ మండల కన్వీనరు శివశంకర్, నాయకుడు విష్ణునారాయణ మాట్లాడుతూ దివ్యాంగుల పింఛన్లు పునరుద్ధరించపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు రామ్మోహన్, తిరుమలాపురం కృష్ణారెడ్డి, గడ్డంవారిపల్లి రామకృష్ణారెడ్డి, ఓబుల్‌రెడ్డి, లక్ష్మిరెడ్డి, లక్షుంపల్లి మల్లారెడ్డి, పెద్దమల్లేపల్లి చంద్ర, వాసాపురం నాగభూషణ, శ్రీరాములు, నిట్టూరు భాస్కర్‌రెడ్డి, గంగిరెడ్డి, రవి, యల్లనూరు కిరణ్, బుక్కాపురం రామాంజనేయులు, మునేంద్ర, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.



యల్లనూరులో తహసీల్దాకు వినతిపత్రం ఇస్తున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనరు శివశంకర్



గార్లదిన్నెలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గార్లదిన్నె: కూటమి ప్రభుత్వం పింఛన్ వెరిఫికేషన్ పేరుతో దివ్యాంగులకు అన్యాయం చేసిందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎల్లారెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద దివ్యాంగుల పింఛన్లు పునరుద్ధరించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆందోళన చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రం తహసీల్దార్ ఈరమ్మకు అందజేశారు. కార్యక్రమంలో జంబులదిన్నె సొసైటీ మాజీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, నియోజకవర్గ రైతు సంఘం అధ్యక్షుడు పుల్లారెడ్డి, ఆర్టీఐ విభాగం అధ్యక్షుడు నాగరాజు, ఎస్సీ సెల్ నాయకుడు ప్రసాద్, యువజన విభాగం నాయకుడు బాలిరెడ్డి, నియోజక వర్గ బూత్ కమిటీ కన్వీనర్ ఓబిరెడ్డి, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రీ వెరిఫికేషన్ అంటూ మా పొట్ట కొట్టొద్దయ్యా ..



నోటీసులు చూపుతున్న దివ్యాంగులు జయన్న, ధర్మక్క దంపతులు

పుట్లూరు: అయ్యా... పింఛన్ డబ్బు వస్తే మినహా ఐదు వేళ్లు నోట్లోకి వెళ్లే పరిస్థితి లేదు. నా ఇంటాయన జయన్న పుట్టుకతో మూగ, నాకు కళ్లు కనబడవు అంటూ శనగలగూడూరు గ్రామానికి చెందిన ధర్మక్క తన భర్తతో కలిసి ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఆవేదన వ్యక్తం చేసింది. ఇద్దరికీ ప్రతినెలా పింఛన్ వచ్చేది. ఇప్పుడు నోటీసులు ఇచ్చి మీకు పింఛన్ రాదంటున్నారు. ఇదేం న్యాయం సారూ...మేం ఏమన్నా తప్పు చేశామా..? ఇంత పెద్ద శిక్ష వేశారు. ఈ వయస్సులో పనులకు వెళ్లి బతికే సత్తువ మాకు లేదు. మాకు ఒక కూతురు ఉండగా పెళ్లి చేసి అత్తారింటికి పంపాం. ఉన్నఫలంగా పింఛన్ తీసేస్తే ఎలా బతకాలంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని వారు కన్నీటిపర్యంతమయ్యారు.

దివ్యాంగుల పింఛన్లను పునరుద్ధరించాలి



గుంతకల్లులో కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న న్యూ డెమోక్రసీ నాయకులు



పామిడిలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్: రీ వెరిఫికేషన్ పేరిట పట్టణంలో రద్దు చేసిన దివ్యాంగుల పెన్షన్లను పునరుద్ధరించి మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్‌ను సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ నాయకులు కోరారు. సోమవారం కమీషనర్‌ను ఆ పార్టీ డివిజన్ కార్యదర్శి బి.సురేష్ తదితరులు కలిసి వినతిపత్రం అందజేశారు. వైకల్యాశాతం తక్కువ ఉందంటూ అర్హులైన దివ్యాంగుల పెన్షన్లను తొలగించడం దుర్మార్గమన్నారు. రద్దు చేసిన పెన్షన్లను పునరుద్ధరించాలని, లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని సురేష్ హెచ్చరించారు. న్యూడెమోక్రసీ పార్టీ నాయకులు జిలాన్, రామాంజి, సత్తార్, రామ్‌దాస్, బాష, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో..

పామిడి: తొలగించిన దివ్యాంగుల పింఛన్లను పునరుద్ధరించాలంటూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఆపార్టీ గుంతకల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జులు శ్రీనివాసులు, నాగరాజు, స్థాని నాయకుడు పి అనిమిరెడ్డి మాట్లాడారు. దివ్యాంగుల పింఛన్లను పునరుద్ధరించని పక్షాన ఉద్యమిస్తామని వారు హెచ్చరించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని వారు ఈఓఆర్డీ అశ్వర్థనాయుడుకు అందజేశారు. ఆయా పార్టీల అనుబంధసంఘాల నాయకులు, చంద్రమోహన్ రెడ్డి, మల్లేసు, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి వెండి కవచం వితరణ

తాడిపత్రి రూరల్: పట్టణంలోని పార్వతీ సమేత బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఉన్న కోదండరామస్వామి ఉప ఆలయంలోని ఆంజనేయస్వామికి సోమవారం రాజ్యలక్ష్మి అనే భక్తురాలు వెండి కవచం వితరణ చేశారు. దాదాపు రూ.లక్ష విలువైన వెండి కవచానికి ప్రత్యేక పూజల అనంతరం అర్చకులకు దాత అందజేశారు.

యూరియా విక్రయాల్లో అక్రమాలకు పాల్పడితే చర్యలు

పెద్దవడుగూరు: మండలంలోని ఫర్టిలైజర్ షాపుల యజమానులు యూరియా విక్రయించడంలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ ఉషారాణి హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ షాపులను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె రికార్డులను పరిశీలించారు. ఎరువులు విక్రయాల్లో అవకతవకలు జరిగితే ఉపేక్షించేది లేదన్నారు. కార్యక్రమంలో ఏఓ మునికృష్ణ , సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయాల సేవలపై కమిషనర్ ఆరా

గుత్తి: పట్టణంలోని రెండు వార్డు సచివాలయాలను మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. సచివాలయంలో ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. సమయపాలన పాటించాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు.

వాహనాల తనిఖీ

గుత్తి: పట్టణంలోని పలు ప్రాంతాల్లో సోమవారం ఎస్‌ఐలు సురేష్, గౌతమ్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులకు జరిమానా విధించారు. అలాగే రికార్డులు లేని జీపులు, కార్లు, ఆటో డ్రైవర్లకు జరిమానా విధించారు.